క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కాకాణితో పార్టీ నాయకులు

పొదలకూరు : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండలంలోని బిరదవోలు పంచాయతీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జన్మదినం జరుపుకున్న కాకాణికి శుభాకాంక్షలు తెలియజేశారు. పంచాయతీ రాజకీయాలపై చర్చించారు. ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, బడుగు శ్రీనివాసులు, ఆకుల గణేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, ఇంద్రసేన్‌గౌడ్, యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



కొడవలూరు : స్థానిక గ్రంథాలయంలో గురువారం నుంచి నిర్వహించే 57వ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఎంఈఓ జి.వసంత కుమారి, గురుకుల ప్రిన్సిపల్ పి.దేవసహాయం చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉందన్నారు. గ్రంథాలయాధికారి కె.రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాంక్ అకౌంట్స్ చేసుకోవాలి



ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

తోటపల్లిగూడూరు : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ పోస్టల్ బ్యాంక్ అకౌంట్స్ ఉండేలా చర్యలు తీసుకొంటున్నామని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఇస్కపాళెం, చింతోపు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాంక్ అకౌంట్స్ ప్రత్యేక శిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 7,500 మంది బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాలేదన్నారు. ప్రతిఒక్కరూ తమ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌కార్డును అనుసంధానం చేయించుకోవాలన్నారు. ప్రజల సౌలభ్యం కోసం పోస్టల్ శాఖ ప్రతి పోస్టాఫీసులో పోస్టల్ బ్యాంక్ అకౌంట్లను చేస్తోందన్నారు. గ్రామీణులు పోస్టల్ బ్యాంక్ అకౌంట్ చేయించుకోవాలని సూచించారు.

భారీ వర్షం.. అస్తవ్యస్తం



గుంతలమయంగా బండేపల్లి రోడ్డు



అధ్వానంగా మారిన పిడూరురోడ్డు

- అంతర్గత రోడ్లు రొచ్చురొచ్చు
- నీట మునిగిన వ్యవసాయ పొలాలు

మనుబోలు : మనుబోలు మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అసలే గుంతలమయంగా ఉన్న వివిధ గ్రామాలకు వెళ్లే తారురోడ్లు మరింత ఘోరంగా తయారయ్యాయి. బండేపల్లి గ్రామానికి వెళ్లే తారురోడ్డుపై అడుగులోతు నీరు పారుతున్నాయి. దీంతో వాహనాల్లో గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే దుర్భరంగా మారుతోంది. మంగళవారం రాత్రంతా కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాలు, నారుమళ్లు నీట మునిగాయి.

ప్రస్తుతానికి పెద్దగా నష్టం లేకున్నా వర్షం ఇలాగే కొనసాగితే నీట మునిగిన నారుమళ్లు పాచిపోయే ప్రమాదం ఉంది.

రైతుల్లో ఆందోళన

మండలంలోని రైతాంగం వర్షానికి రెండు మూడు రోజుల ముందు నారుమళ్లు వేశారు. ఇప్పుడు అవి నీట మునగడంతో వర్షం మరింత పెరుగుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే మండల పరిధిలోని జాతీయ రహదారితో పాటు బద్దెవోలు రోడ్డు, మనుబోలు–పొదలకూరు ఆర్‌అండ్‌బీ రోడ్ల నుంచి వివిధ గ్రామాలకు వెళ్లేందుకు తారు, గ్రావెల్ రోడ్లు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకు దెబ్బతిని గతుకులమయంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిసినా ఈ రోడ్లపై ప్రయాణించే పరిస్థితి లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా రోడ్లకు మరమ్మతులు చేసిన దాఖలా ల్లేవు.

దెబ్బతిన్న బంతిపూల సాగు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో కురిసిన భారీ వర్షానికి ఇటీవల నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయి. అలాగే కోతదశకు వచ్చిన బంతి పూలతోటలు దెబ్బతిన్నాయి. పొలాల నుంచి నీరు బయటకు వెళ్లేందుకు కాలువలు లేనందున లేతపైర్లు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బంతిపూలకు మంచి డిమాండ్ ఉన్న తరుణంలో వర్షం వల్ల కోతదశలో ఉన్న పూలు పాచిపోయాయని ఉద్యానవన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసినప్పటికీ ఫలితం చేతికొచ్చే దశలో నష్టపోయామని వారు వాపోతున్నారు.



వర్షానికి వాలిపోయిన బంతిపూల మొక్కలు



వర్షం నీటిలో మునిగిపోయిన పైరు

ఆందోళనగా ఉంది



గత రాత్రి కురిసిన భారీ వర్షానికి నారుమళ్లు నీట మునిగాయి. కేవలం నాలుగు రోజుల క్రితమే నారు మడి వేయడంతో ఇంకా పూర్తిగా మొలకైనా ఎత్తలేదు. ఇలాంటి పరిస్థితిలో పంట నీట మునగడంతో ఆందోళనగా ఉంది. ఇంతటితో వర్షం ఆగితే ఇబ్బంది ఉండదు. వర్షం కొనసాగితే మాత్రం మళ్లీ నారు పోసుకోవాల్సి వస్తుంది.

– మేకల రమణయ్య , రైతు, బండేపల్లి

రోడ్లను బాగు చేయాలి



మనుబోలు నుంచి పిడూరుకు ఉన్న తారురోడ్డు అధ్వానంగా ఉంది. చిన్న వర్షానికే గుంతల్లో నీరు చేరి బురదమయంగా తయారవుతోంది. దీంతో వాహనాల్లో గ్రామానికి రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, పిడూరు



బండేపల్లిలో నీట మునిగిన పొలాలు

16న మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్య తదితర సమస్యలపై చర్చిస్తామని, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలియజేశారు.

300 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 300 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 3,916 మంది విద్యార్థులకు, 3616 మంది హాజరయ్యారని తెలియజేశారు.

మినగల్లులో అర్జీల స్వీకరణ



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లు గ్రామంలో సర్పంచ్ పూజిత అధ్యక్షతన తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. రీసర్వేలో తలెత్తిన సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పొదలకూరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవం అందుకున్న పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్‌ను బుధవారం పాఠశాలలో సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బోగోలు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సహోపాధ్యాయులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం లభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సనత్ కుమార్, విద్యాకమిటీ చైర్మన్ ధనలక్ష్మి, వైస్ చైర్మన్ హసీనా, సభ్యులు పెంచలయ్య, పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పొదుపు రుణాలతో ఆర్థికాభివృద్ధి

మనుబోలు : పొదుపు లక్ష్మి ద్వారా తీసుకున్న రుణాలతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. మండల కేంద్రంలోని చంద్రమౌళినగర్ గిరిజన మహిళలతో బుధవారం ఆమె సమావేశమై పొదుపు రుణాలను ఎలా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పొదుపు రుణాల ద్వారా టిఫిన్ అంగళ్లు, పచారి దుకాణాలు, కుట్టు మెషీన్లు, చేపలు పట్టడం ద్వారా ఉపాధి పొందుతున్న మహిళలను ఆమె అభినందించారు. ఆమె వెంట ఏపీఎం వనజాక్షి, ఈఓపీఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, సీసీలు విజయమ్మ, ప్రసన్న, వీఏఏలు హిమజ, లక్ష్మీప్రసన్న ఉన్నారు.



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

72.4 మిల్లీమీటర్ల వర్షపాతం

ముత్తుకూరు : సముద్రతీర ప్రాంతమైన ముత్తుకూరు మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురుస్తూనే ఉంది. తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. 72.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షపునీటితో పంటచేలు నిండిపోయాయి.

జర్నలిస్ట్ మృతికి ప్రసన్న నివాళి

కొడవలూరు : కొడవలూరు మండలానికి చెందిన జర్నలిస్ట్ ఎస్కే.మస్తాన్‌బాషా(59) బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. కొడవలూరులోని వారి నివాసంలో మస్తాన్‌బాషా మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, పలువురు నేతలు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గిరిజన కాలనీలో అన్నదానం



తోటపల్లిగూడూరు : కోడూరు పంచాయతీ రవీంద్రపట్టపుపాళెం గిరిజన కాలనీవాసులకు కల్పవృక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో స్థానిక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ట్రస్ట్ చైర్మన్ గుమ్మనేని వాణి భవాని నాయుడు కాలనీలోని 60 కుటుంబాలకు అన్నదానం చేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటు కీలకం



మాట్లాడుతున్న ఎస్సై రాకేష్

మనుబోలు : మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శివరాకేష్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలతో మనుబోలు మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముఖ్యమైన ప్రదేశాలను పరిశీలించామని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే గ్రామాల్లో కూడా ముఖ్యమైన ప్రదేశాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. దీనివల్ల దొంగతనాలు, నేరాలు జరిగినప్పుడు కారణమైన వ్యక్తులను త్వరితగతిన గుర్తించవచ్చని తెలిపారు. మండల వ్యాప్తంగా 150 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. కెమెరాల ఏర్పాటుపై దుకాణదారులతో సమావేశం నిర్వహించి చర్చిస్తామన్నారు. దాతలు ముందుకొస్తే వారి సహకారం తీసుకుంటామన్నారు.

చాచా నెహ్రూకు కళా నివాళి



ముత్తుకూరు : కార్వింగ్ పద్ధతిలో వేసిన చిత్రం



పొదలకూరు : రావి ఆకుపై వేసిన చిత్రం

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం బుధవారం మర్రి ఆకుపై కార్వింగ్ పద్ధతిలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రాన్ని రూపొందించారు. ఈనెల 14వ తేదీన బాలల దినోత్సవం, చాచా నెహ్రూ జయంతి సందర్భంగా జాతీయ జెండా నీడలో నెహ్రూ చిత్రాన్ని ఆవిష్కరించారు.

- పొదలకూరు : బాలల దినోత్సవం సందర్భంగా మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై చాచా నెహ్రూ బొమ్మను గీశారు. ఆయనకు కళా నివాళి అర్పించారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలి

మనుబోలు : ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా క్లస్టర్ ఏపీడీ శంకర నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ఉన్న ఐదుగురు ఐఏఎస్‌లు స్వపరిపాలన అనే అంశంపై త్వరలో మనుబోలు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలిస్తారని తెలిపారు. ఇక్కడ పనులు ఎలా జరుగుతున్నాయి, వాటి వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం కలుగుతుంది అనే విషయాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి తెలుసుకుంటారన్నారు. ఆయన వెంట ఈసీ సుప్రజ, టీఏ గుర్రప్ప ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న శంకరనారాయణ

లేత నారు వేసుకుంటే దిగుబడులు



కొడవలూరు : యల్లాయపాళెంలో అధికారుల క్షేత్రసందర్శన



పొదలకూరు : రైతులతో మాట్లాడుతున్న ఏఓ వాసు

కొడవలూరు : వరిలో లేత నారు వేసుకుంటే పిలకలు బాగా పెట్టి దిగుబడి పెరుగుతుందని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో రక్షక పంటలైన బంతి, ఆవాలు వంటి మొక్కలు వేసుకోవడం ద్వారా ప్రధాన పంటను తెగుళ్లు, పురుగులు ఆశించడం తగ్గుతుందన్నారు. పురుగు మందులను అధికంగా వినియోగిస్తే మిత్ర పురుగులను నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ జి.ఉమామహేష్, వీపీఏ వెంకటరమణయ్య, సొసైటీ సీఈఓ జి.వంశీ, రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు

పొదలకూరు : ఎరువుల కోసం అన్నదాతలు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లపాళెం, అమ్మవారిపాళెం గ్రామాల్లో ఏఓ బుధవారం క్షేత్ర సందర్శన చేసి రైతులతో మాట్లాడారు. రెండురోజుల పాటు కురిసిన వర్షాల వల్ల వరి నారుమళ్లకు చెప్పుకునే స్థాయిలో నష్టం రాలేదన్నారు. రైతులకు కిలో రూ.5 వంతున వరివిత్తనాలపై రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కేఎన్‌ఎం 1638 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నల్లపాళెం గ్రామ రైతులకు యూరియాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఏడుకొండలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఐఎల్‌కు అవార్డులు



తోటపల్లిగూడూరు: దేశంలో అతి పెద్ద స్వతంత్ర్య విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా ఏడు ప్రతిష్టాత్మక 5ఎస్ అవార్డులు లభించాయి. తిరుపతిలో నిర్వహించిన పదో కన్వెన్షన్లో ఈ అవార్డులను దక్కించుకున్నామని కంపెనీ సీఈఓ రాఘవ్ త్రివేది తెలిపారు. అవార్డులను అందుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

రామన్నపాళెంలో పొలంబడి



బ్యాలెట్ పరీక్షలో పాల్గొన్న రైతులు

కొడవలూరు : పొలంబడి కార్యక్రమం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడం లక్ష్యమని ఏఓ లక్ష్మి అన్నారు. మండలంలోని రామన్నపాళెంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు బుధవారం బ్యాలెట్ పరీక్ష నిర్వహించి వ్యవసాయంలో రైతుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఎలాంటి పద్ధతులు అమలు చేయడం ద్వారా వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకుని దిగుబడిని పెంచుకోవాలో తెలియజేశారు. అనంతరం వరిలో మొలక శాతాన్ని చూసే పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు ఆర్.నిహారిక, డి.శివజ్ఞాన, స్థానిక నేత కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు



పొదలకూరు : పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద కార్తీక వనభోజనాలను బుధవారం ఏర్పాటు చేశారు. తొలుత ఉసిరి చెట్టు కింద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవింద నామస్మరణలతో వనభోజనాలను చేశారు. దామోదర్రావు–శశిప్రభ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లక్కాకుల ఆనంద్‌రావు, పెంచలయ్య, శేఖర్, లక్ష్మి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.